నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, శనివారం 13 ఏప్రిల్ 2024 MAHABUBNAGAR NARAYANPET

# విగ్రహాలు కాదు.. విజ్ఞానకేంద్రాలు కావాలి

- బస్తీకొక అంబేద్కర్‌ను తయారు చేయాలి
- బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్‌పీ



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గద్వాల రూరల్, ఏప్రిల్ 12 : విగ్రహాలకు బదులు విజ్ఞానకేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి బస్తీ నుంచి ఒక అంబేద్కర్‌ను తయారు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచన పండుగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కేఎస్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎస్‌పీ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు కృషి చేయాలన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఇలాంటి పండుగలను నిర్వహించుకొని అందరితో అంబేద్కర్ ఆలోచనా విధానాలను పంచుకోవడం శుభపరిణామమన్నారు. ప్రతి ఇంట్లో లైబ్రరీని ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చాలామంది తన వద్దకు వచ్చి అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు సహాయం కోరుతున్నారని.. అందుకు బదులుగా విజ్ఞాన మందిరాలు ఏర్పాటు చేసుకోవాలని.. అందుకు అవసరమైన డబ్బులు కూలి పని చేసైనా ఇస్తానని ఆయన అన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానాలను యువత ముందుకు తీసుకెళ్లాలని ఓయూ ప్రొఫెసర్ ఖాసీం సూచించారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ప్రకాశ్, ఉదయ్‌కిరణ్, మోహన్, ఆశన్న, యేసన్న, జాన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# కరుణించిన వరుణుడు



అచ్చంపేటలో కురుస్తున్న వర్షం


- పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షం
- ఉప్పునుంతల మండలం తాడూరులో పిడుగుపడి మహిళ మృతి

నాగర్‌కర్నూల్/అచ్చంపేట/ఉప్పునుంతల/ తిమ్మాజిపేట/రాజాపూర్, ఏప్రిల్ 12 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చిరు జల్లులు కురిశాయి. 5 గంటల సమయంలో వాతావరణం కాస్త చల్లబడి ఉరుములతో కూడిన వర్షం కురిసింది. గత రెండు వారాలుగా తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనాన్ని ఇచ్చినట్లయ్యింది. పట్టణంలోని ప్రధాన రహదారిలో డ్రైనేజీలు ఉప్పొంగి వర్షపునీరు రోడ్లపై పారింది. కొన్ని చోట్లా డ్రైనేజీల నుంచి వర్షపు నీరు ఉబికి రావడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా అచ్చంపేటలోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది. అలాగే ఉప్పునుంతల మండలం తాడూరుకు చెందిన గుండెమోని శ్యామలమ్మ(34) శుక్రవారం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా అకస్మాతుగా ఈదురుగాలులు వీయడంతో చెట్టుకిందకి వెళ్లింది. ఆ చెట్టుపై పిడుగుపడడంతో అక్కడకక్కడే మృతి చెందింది. తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లి, నేరెళ్లపల్లి, అమ్మపల్లి గ్రామాల్లో శుక్రవారం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోగా కొంతమేర కొట్టుకుపోయింది. అమ్మపల్లిలో ఆరబోసిన మిర్చి కూడా తడిసిపోయింది. పంట అమ్ముకునే సమయంలో వర్షం తమను నట్టేట ముంచిందని రైతులు వాపోయారు. మహహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో కూడా శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది.

# విద్యుదాఘాతంతో తోడి కోడళ్లు మృతి

తాడూరు, ఏప్రిల్ 12 : విద్యుదాఘాతానికి గురై తోడి కోడళ్లు మృతిచెందిన ఘటన తాడూరు మండలం ఐతోలులో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన యూసుఫ్, ఇబ్రహీం అన్నదమ్ములు. ఇబ్రహీం ఇంటి వద్దనే డబ్బాలో ఐరన్ దుకాణం(బోరుమోటర్ వైండింగ్) నడుపుతూ జీవిస్తుండగా అన్న యూసుఫ్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం గిరాకీ రావడంతో ఇబ్రహీం భార్య ఆలియాబేగం దుకాణంలోకి వెళ్లి పైపులను పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. శబ్దం రావడంతో తోడికోడలు తస్లీమాబేగం అక్కడికి వెళ్లి డబ్బా డోర్‌ను పట్టుకోగా షాక్ కొట్టింది. అప్పటికే వర్షం కురుస్తుండడం, ఇంటి పైకప్పుగా ఉన్న రేకులకు స్తంభానికి ఉన్న జేవైర్‌తో సపోర్టుగా కట్టి ఉండడంతో దుకాణం మొత్తానికి విద్యుత్ సరఫరా అయ్యి తస్లీమాబేగం(50), ఆలియాబేగం(40) అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన కుటుంబసభ్యులు విద్యుత్ షాక్ కొట్టిందని గుర్తించి వెంటనే మెయిన్ ఆఫ్ చేశారు. అనంతరం ఇరువురిని నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో దవాఖాన ప్రాంగణంలో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# బీజేపీలో.. ముసలం



పార్టీ ఎంపీ అభ్యర్థిపైనే నేతల తిరుగుబాటు

- మక్తల్, నారాయణపేటలో సంచలనంగా పలువురి రాజీనామాలు
- అదే బాటలో మరికొందరు..
- ఇప్పటికే జితేందర్ జంప్.. శాంతంగా శాంతకుమార్
- అరుణ తీరుపై బీజేపీ క్యాడర్ మండిపాటు
- సీనియర్లకు కాంగ్రెస్ గాలం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీలో ముసలం రేగుతున్నది. ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ వ్యవహార శైలితో పార్టీని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. ఇదివరకే టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరగా రాష్ట్ర కోశాధికారిగా ఉన్న శాంతకుమార్ కూడా పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. బీజేపీకి కంచుకోటగా ఉన్న మక్తల్, నారాయణపేట సీనియర్ నేతలు తాజాగా రాజీనామాలు చేయడంతో పార్టీలో ముసలం బయటపడింది. ఎంపీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ చాలా మంది నేతలు డీకే అరుణ తీరుపై తీవ్ర అసహనంతో ఉన్నట్లు సమాచారం. మరోవైపు మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల్లోని బీసీ సామాజికవర్గ నేతలు తమను పట్టించుకోవడం లేదనే ఆవేదనతో పార్టీని వదిలి వెళ్తున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. మహబూబ్‌నగర్‌లోనూ అభ్యర్థి ఒంటరి పోకడ సీనియర్ నేతలకు నచ్చడం లేదు. క్యాండిడేట్ కానంతవరకు అందరినీ కలుపుకొనిపోయిన అరుణ అప్పుడే ఎంపీ అయిపోయినట్లుగా వ్యవహరిస్తుండడంతో పార్టీలో ప్రకంపనలు మొదలయ్యాయి. ఏళ్ల తరబడి పార్టీని తమ భుజాలపై మోసిన నాయకులు చాలామంది పార్టీలో ఉన్నారు. పదవులు ఆశించకుండా పార్టీ వెన్నంటి ఉన్న నేతలను విస్మరించడంతో కమలంలో ఏదో జరుగుతున్నదని భావిస్తున్నారు. మరోవైపు పార్టీ నేతలకు తెలియకుండా ప్రెస్‌మీట్‌లు పెట్టి కాంగ్రెస్ నేతలను ఎడాపెడా తిడుతూ మీడియా ప్రచారానికే పరిమితమవుతున్నారన్న వాదనలు ఉన్నాయి. పార్లమెంట్ సమీక్షలంటూ కేవలం తనవర్గం వారిని మాత్రమే ఆహ్వానిస్తూ మిగతా వారిని విస్మరిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా పార్టీని చీల్చడానికి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మరో నేత ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మొత్తంగా పాలమూరులో బీజేపీ నేతలు రెడ్డి, బీసీ వర్గాలుగా విడిపోయారని స్పష్టమవుతున్నది.

## కమలానికి రాష్ట్ర నేత గుడ్‌బై..

ఉమ్మడి జిల్లాలో పార్టీని పట్టుకొని నెట్టుకొచ్చిన సీనియర్ నేతలు ఒక్కొక్కరుగా రాజీనామా చేస్తున్నారు. బీజేపీకి మంచి పట్టుఉన్న నారాయణపేట నియోజకవర్గంలోనూ ఇటీవల అసెంబ్లీకి పోటీ చేసి ఓటమిపాలైన ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు రతంగ్ పాండు రెడ్డి రాజీనామా చేశారు. మూడు దశాబ్దాలుగా నారాయణపేటలో తిరుగులేని నేతగా ఉన్న తనను కాదని చోటామోటా లీడర్లకు అరుణ ప్రాధాన్యం ఇవ్వడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారట. మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తూ ఒంటి చేత్తో పార్టీని బతికించారు. అలాంటి సీనియర్ నేత రాజీనామా సమర్పించడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, మక్తల్‌లో మంచి పట్టు ఉన్న నేత, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 50వేలకుపైచిలుకు ఓట్లు తెచ్చుకున్న మరో రాష్ట్ర నాయకుడు జలంధర్‌రెడ్డి కూడా పార్టీకి రాంరాం చెప్పారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సీనియర్ నేతలు రాజీనామా చేయడంతో పార్టీ పరిస్థితి దయనీయంగా మారింది. చిన్నచింతకుంట లో కమలం పార్టీ అంటే నంబిరాజు అనే స్థాయికి తీసుకుపోయిన మండల అధ్యక్షుడికి ప్రాధాన్యత లభించకపోవడంతో ఆయన దారి చూసుకున్నారు.

## డీకేపై జిత్తు స్కెచ్

మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి పోటీ చేయాలని భావించిన జితేందర్‌రెడ్డికి బీజేపీ అధిష్టానం టికెట్ ఇవ్వకపోవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. నాటి నుంచి బీజేపీకి చెందిన పలువురితో కోవర్ట్ ఆపరేషన్ ప్రారంభించారు. ఒక్కో నియోజకవర్గంలోని తనకు చెందిన నేతలందరినీ కాంగ్రెస్‌లోకి లాగుతున్నారు. అరుణను పాలమూరులో ఓడగొట్టి గద్వాలకు పంపించాలని జితేందర్‌రెడ్డి శపథం పూనినట్లు సమాచారం. ఆమె అధిష్టానానికి పార్టీ ఫండ్ ఇచ్చి టికెట్ తెచ్చుకున్నదని అప్పట్లోనే ఆరోపించారు. కాగా బీజేపీ నేతలందరినీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగా కాంగ్రెస్‌లోకి లాగాలని భారీ స్కెచ్ వేశారు. ఈ క్రమంలోనే మక్తల్, పేట నియోజకవర్గాల్లోని సీనియర్ నేతలతో రాజీనామా చేయించడంలో సఫలీకృతుడయ్యాడు. తన టికెట్‌ను ఎగరేసుకుపోయిన అరుణకు చెక్‌పెట్టేందుకు జితేందర్‌రెడ్డి భారీ వ్యూహం పన్నినట్లు రాజకీయవర్గాల్లో చర్చ కొనసాగుతున్నది.

## పాలమూరు మోదీకి అవమానం

ఉమ్మడి జిల్లాలో బీజేపీని తన భుజాలపై మోస్తున్న బీసీ నేతకు ఆ పార్టీలో ఘోర అవమానం చేశారు. 2009 నుంచి టికెట్ ఆశిస్తున్న రాష్ట్ర కోశాధికారి, బీసీ నేత అయిన శాంతకుమార్‌కు టికెట్ ఇవ్వకుండా అధిష్టానం మొండిచేయి చూపిస్తూ వచ్చింది. శాంతకుమార్ తనను తాను పాలమూరు మోదీగా చెప్పుకొంటున్నారు. 2014 నుంచి బీజేపీ వలసవాదులకు టికెట్ ఇస్తూ వస్తున్నది. తెలంగాణ ఆవిర్భావ సమయంలో అప్పుడే వచ్చిన నాగం జనార్దన్‌రెడ్డికి కేటాయించారు. 2018లో గద్వాలలో ఘోరంగా ఓడిపోయి కాంగ్రెస్ నుంచి వచ్చిన అరుణకు 2019లో టికెట్ ఇచ్చారు. అయినా శాంతకుమార్ పార్టీ నిర్ణయాన్ని కాదనలేదు. చివరకు 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ తెలంగాణలో బీసీ నినాదాన్ని పూరించారు. దీంతో ఈసారి తనకే టికెట్ వస్తుందని ఎదురుచూశారు. ఏ చిన్న కార్యక్రమం జరిగినా షాద్‌నగర్ నుంచి మక్తల్ వరకు భారీ ఫ్లెక్సీలతో స్వాగత తోరణాలు కట్టించారు. అయినప్పటికీ ఆయనకు టికెట్ ఇవ్వకుండా అవమానించడంతో ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీ అభ్యర్థిగా అరుణను ప్రకటించగా బీసీ నేత శాంతకుమార్‌ను ఆమె పలకరించకపోవడంతో ఆయన మనస్తాపానికి గురైనట్లు తెలిసింది.

## అప్పుడే ఎంపీ అయినట్టు..!

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు నిర్వహించక ముందే అరుణ ఎంపీగా గెలిచినట్లు సంబురపడిపోతున్నారట. కొంతమంది పార్టీ నేతలు, అధికారులతో 'బిడ్డా నేను రేపు ఎంపీగా గెలుస్తా'.. అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అనుచరులు సైతం ఆమె ఎంపీ అయినట్లు అప్పుడే ఫీల్ అవుతున్నారట. పార్టీలో సీనియర్ నేతలను పట్టించుకోకపోవడం, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, ఏబీవీపీ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న వారికి విలువ ఇవ్వకపోవడంతో వారంతా బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటిస్తున్నారని తెలిసింది. మొత్తంగా అరుణను ఓడించేందుకు ఆ పార్టీ నేతలే ప్రయత్నిస్తుండడం చర్చనీయాంశమైంది.

# 'కళ' తప్పిన కాల్వ

- బోసిపోయిన జూరాల ప్రాజెక్టు ప్రధాన కాల్వ
- క్రాప్ హాలీడేతో మాగాణులు బీళ్లుగా దర్శనం



పెబ్బేరు వద్ద వట్టిపోయిన జూరాల ప్రధాన ఎడమ కాల్వ

పెబ్బేరు, ఏప్రిల్ 12 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ (ఎన్టీఆర్) కాల్వ వట్టిపోయింది. ప్రతి వేసవిలో నీటి సరఫరా నిలిపివేసినా అక్కడక్కడా నీళ్లు కనిపించేవి. కానీ ఈ సారి మాత్రం చుక్క నీరు కూడా కనిపించడం లేదు. ఎండల నేపథ్యంలో ఈ పరిస్థితి దాపురించిందని జూరాల ఆయకట్టు రైతులు అంటున్నారు. గద్వాల జిల్లా జూరాల డ్యాం నుంచి ప్రారంభమయ్యే ఈ కాల్వ వనపర్తి జిల్లా మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ వరకు ప్రయాణిస్తుంది. మూడు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరందిస్తూ రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్న జూరాల ప్రధాన కాల్వ ప్రస్తుతం బోసిపోయి కనిపిస్తున్నది. కృష్ణానదిలో నీటి జాడలు కరువై కళ తప్పింది. కేసీఆర్ ప్రభుత్వంలో గతేడాది పచ్చని మాగాణుల్లో దర్శనమిచ్చిన పొలాలు నేడు బీడు భూములుగా మారాయి. ఇప్పటికే జూరాల కింద క్రాప్‌హాలీడే ప్రకటించడంతో పచ్చని పైర్లు మాయమయ్యాయి.

# ఎండుతున్న పంటలు

- బూడిదపాలవుతున్న రైతుల రెక్కల కష్టం
- పశువులకు మేతగా మారుతున్న వరి పైర్లు
- కాల్వల్లో నీళ్లు లేక నోళ్లు తెరిచిన చెరువులు, కుంటలు
- అడుగంటిన భూగర్భజలాలు
- మాగనూరు మండలంలో 2వేల ఎకరాల్లో నష్టం



ఒబ్లాపూర్‌లో మేకలకు మేతగా మారిన వరి పంట

మాగనూర్, ఏప్రిల్ 12 : నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఎకరం మొదలుకొని మూడెకరాల వరకు ఎండుతూనే ఉన్నాయి. కొన్ని పల్లెల్లో అయితే పదెకరాల వరకు ఎండిపోయాయి. వరి పంటలు ఎండిపోయి ఎకరాకు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఈ యాసంగిలో సాగుకు పెట్టిన పెట్టుబడి నష్టపోయి అన్నదాతలు ఆర్థికంగా చితికిపోయారు. వరి సాగుకు ఎకరాకు కనీసం రూ.30వేల నుంచి రూ.35వేల వరకు పెట్టుబడి ఖర్చు అవుతున్నది. కోత దశలో పంట ఎండిపోవడంతో, ఇతర ఖర్చులు మినహాయిస్తే ఎకరాకు రూ.25వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఒక్క సీజన్‌లోనే సాగునీళ్లు అందించకపోవడంతో ఇంత భారీ నష్టం వాటిల్లిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**జిల్లా అధికారులకు వివరించాం..**

మాగనూరు మండలవ్యాప్తంగా 4,280 మంది రైతులు 9,746 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చెరువులు, బావులు, బోర్లలో జలం తగ్గింది. దీంతో దా దాపు మండల వ్యాప్తంగా వెయ్యి నుంచి 2వేల ఎకరాల మధ్య వరి పంటలు ఎండిపోయిన విషయం వాస్తవమే. ఈ విషయా న్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–సుదర్శన్‌గౌడ్, మండల వ్యవసాయ అధికారి, మాగనూరు


**కోతదశలో పంట ఎండిపోయింది..**



వాగు పక్కనే రెండెకరాల 20 గుంటల్లో వరి పంట వేశాను. సాగునీరు అందక ఎకరం పంట ఎండిపోతే పశువుల మేతకు ఇచ్చిన. ఉన్న ఎకరానికి పక్క పొలాల రైతులు నీళ్లిస్తున్నరు. అవి కూడా తడికి సరిపోవడం లేదు. ఇక పంట చేతికి రాదని ఆశలు వదులుకున్న. నేను పెట్టిన పెట్టుబడి కలుపుకొని దాదాపు రూ.70వేల నష్టం వాటిల్లింది.

– ఎన్ కేకే రెడ్డి, రైతు, పర్మన్‌దొడ్డి

**సాగునీరిస్తే పంటలు ఎండకపోయేవి..**



ప్రజాప్రతినిధులు సాగునీటిపై దృష్టి పెట్టి ఉంటే పంటలు ఎండకపోయేవి. రైతులు ఇంత నష్టపోయేవారు కాదు. పంటలు ఎండి న ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, మందిపల్లి

# కనిపించని నీటి జాడలు



నీరు లేక వట్టిపోయిన మాచర్ల చెరువు

- నీళ్లులేక వట్టిబోయిన ప్రాజెక్టులు, చెరువులు
- నాడు మాగాణులు.. నేడు బీడు భూములు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో కరువు ఛాయలు
- కేసీఆర్ ప్రభుత్వంలో సాగునీటి పరవళ్లు

గద్వాల, ఏప్రిల్ 12 : గతంలో ప్రతి గ్రామానికి ప్రధాన నీటి వనరుగా చెరువులే ఉండేవి. వీటిలోని నీటి ద్వారానే పంటలు సాగు మొదలు ఇంటి అవసరాలు, పశు పక్షాదులకు నీరే లభించేది. పల్లెల్లోని ప్రతి కుటుంబం చెరువు నీటిని వినియోగించుకునేవారు. చెరువులను అభివృద్ధి చేయకపోవడంతో దానికింద ఉన్న ఆయకట్టుకు అంతంత మాత్రంగానే సాగునీరు అందేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రధాన నీటివనరులైన చెరువులను పునరుద్ధరించి దాని కింద ఉన్న ఆయకట్టును వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం భావించింది. ఈక్రమంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పేరుతో ఒండ్రుమట్టి, పూడికతీత పనులు చేపట్టి చెరువులకు మహర్దశ తీసుకొచ్చారు. దీంతో చెరువుల కింద ఎన్నో ఏండ్లుగా బీడు భూములుగా ఉన్న పొలాలు పచ్చని మాగాణుల్లా మారాయి. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి కరువుఛాయలు కమ్ముకున్నాయి. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలోని ఏ చెరువు కింద చూసినా పచ్చని పైర్లు కనిపించేవి. నేడు ఆ భూములన్నీ బీళ్లుగా మారాయి. గతంలో జూరాల ప్రాజెక్టుకు వరద రాగా బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్లతోపాటు చెరువులు, కుంటలను నింపేది. దీంతో ఎర్రటి ఎండాకాలంలోనూ చెరువులు నీటితో కళకళలాడేవి. ప్రస్తుత ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో జిల్లాలోని చెరువులన్నీ వట్టిపోయి కనిపిస్తున్నాయి.

**గతంలో 23,093 ఎకరాల ఆయకట్టుకు..**

జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని 8 మండలాల్లో 561 చెరువులు ఉన్నాయి. వీటి కింద గత ప్రభుత్వం 23,093 ఎకరాలకు సాగునీటిని అందించింది. కాగా ప్రస్తుతం నీరులేక చెరువులన్నీ వట్టిపోవడంతో ఆయకట్టు సాగవకపోవడంతో మొత్తం బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. జూరాల, ఆర్డీఎస్, నెట్టెంపాడ్, తుమ్మిళ్ల లిఫ్ట్ కింద పంటలకు క్రాప్ హాలిడే ప్రకటించిన విధంగానే చెరువుల కింద కూడా అదే పరిస్థితి నెలకొన్నది. ఈక్రమంలో మత్స్యకారులకు సైతం తిప్పలు తప్పడం లేదు. గతంలో చెరువుల్లో నీరు నిండుగా ఉండడంతో ఉచిత చేపపిల్లలను వదిలి మత్స్యసంపదను సృష్టించేలా ప్రభుత్వం మత్స్యకారులను ప్రోత్సహించింది. ఈ ఏడాది చెరువుల్లో నీరు లేకపోవడంతో మత్స్యకారుల కుటుంబాల పూట గడవడమే కష్టంగా మారింది.

# మూగబోయిన మైక్
# మూలకు చెత్తబండి



- తుప్పుపడుతున్న వాహనాలు
- రోడ్లపైనే చెత్త పారబోత
- పట్టించుకోని అధికారులు
- కేసీఆర్ ప్రభుత్వంలో స్వచ్ఛత దిశగా..
- కాంగ్రెస్ వచ్చాక జడ్చర్లలోసీన్ రివర్స్



23వ వార్డులో చెత్త

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 12 : 'చెత్తమ్మో.. చెత్త.. మీ ఇంటి వద్దకే చెత్తబండి వచ్చిందమ్మా.. తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి చెత్తబండిలో వేయండమ్మా'.. అంటూ నాలుగు నెలల వరకు జడ్చర్ల మున్సిపాలిటీలోని ప్రతి గల్లీలో నిత్యం వాహనాలు చెత్త సేకరించేవి. నేడు చాలా వరకు చెత్త వాహనాలు మరమ్మతులకు నోచుకోక మూలకు చేరాయి. వీధుల్లో తిరగాల్సిన బండ్లు పాడై పురపాలిక కార్యాలయం వద్ద తుప్పుపడుతున్నాయి. రెండేండ్ల కిందట రూ.24 లక్షల నిధులతో అదనంగా 3 ట్రాలీ ఆటోలు, 3 ట్రాక్టర్లను చెత్త సేకరణకు అధికారులు కొనుగోలు చేశారు. దీంతో మున్సిపాలిటీలోని 27 వార్డులకుగానూ ప్రస్తుతం చెత్తసేకరణ కోసం 17 ఆటో ట్రాలీలు, 6 ట్రాక్టర్లు ఉన్నాయి. అయితే ప్రస్తుతం 10 ఆటోలు, 6 ట్రాక్టర్లు మాత్రమే నిత్యం చెత్తను సేకరిస్తున్నాయి. మిగతావి రిపేర్‌కు గురయ్యాయి. వాహనాలు తక్కువగా ఉండడంతో పట్టణంలో రెండు, మూడ్రోజులకోసారి చెత్తను సేకరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పాతబజార్‌కు కేటాయించిన రెండు ఆటోలు చెడిపోవటంతో ఆ ప్రాంతంలో చెత్త రోడ్లపై వేస్తున్నారు. నేతాజీ కూడలి నుంచి సర్కారు దవాఖాన ప్రాంతంలో దుకాణదారులు సైతం చెత్తతో రోడ్లను నింపేస్తున్నారు. చెత్త బండ్లు చాలా కాలనీల్లోకి రాకపోవడంతో ప్రజలు వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛతకు పెద్దపీట వేస్తూ.. అవగాహన కల్పిస్తూ నిత్యం ఇంటింటికీ చెత్తబండి వెళ్లేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సీన్ రివర్స్ అయ్యింది. వాహనాలు సరిపోను లేకపోవడంతో.. ఇప్పుడేమో చెత్తబండీ వచ్చేదెన్నడమ్మా.. చెత్త పారవేసేదెక్కడమ్మా ..అన్న చందంగా పరిస్థితి తయారైంది. కొంతకాలంగా పురవీధుల్లో తిరగాల్సిన బండ్లు పాడైపోయి పురపాలిక కార్యాలయం వద్ద ఓ మూలన పడ్డాయి.

**చెత్తబండ్లను బాగు చేయిస్తాం..**

జడ్చర్ల పట్టణంలో ఏడు చెత్త సేకరించే వాహనాలు రిపేర్‌కు గురయ్యాయి. వాటిని బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి ట్రాక్టర్లను తిప్పించి చెత్త సేకరిస్తున్నాం. రోజు తప్పించి రోజు చెత్తసేకరణకు బండ్లను తిప్పుతున్నాం. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి.

- రాజయ్య, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

# గొర్లకు మేతగా పంట

- బోర్లల్లో తగ్గిన భూగర్భ జలం
- ఎండిన ఎకరం వరి పైరు



ఎర్రగట్టుతండా శివారులో ఎండిన వరి పైరును గొర్రెల మేతకు వదిలేసిన దృశ్యం

గోపాల్‌పేట, ఏప్రిల్ 12 : చేతికొచ్చిన పంట సాగునీరు లేక కండ్లముందే ఎండిపోతున్నది. చేసిన కష్టమంతా చేజారిపోతున్నా చేసేదేమీలేక రైతన్న దిక్కుతోచని స్థితిలో ఎండిన వరి పంటను గొర్లకు మేతగా ఇస్తున్నారు. గోపాల్‌పేట మండలం ఎర్రగట్టు తండాకు చెందిన రైతు లావూడ్యా భాస్కర్ తనకున్న రెండు బోర్లతో యాసంగిలో మూడెకరాల్లో వరి పంట సాగు చేశాడు. పంట చేతికొచ్చే దశలో బోర్లలో నీళ్లు పూర్తిగా తగ్గడంతో పంట క్రమంగా ఎండుతూ వస్తోంది. ఇప్పటికే సగం పంట ఎండిపోగా మిగిలిన పంటను కాపాడుకునేందుకు భాస్కర్ నానా తంటాలు పడుతున్నాడు. మూడెకరాల్లో ఎకరం పంట ఎండిపోగా గొర్ల మేతకు వదిలేశాడు. రెండెకరాలకు కూడా బోర్ల నుంచి వస్తున్న నీళ్లు సరిపోవని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఎకరం వరి సాగుకు రూ.25వేల వరకు ఖర్చు అయిందని, చేసిన కష్టం పోను, పెట్టుబడి కూడా మీద పడుతుందని.. ప్రభుత్వమే ఆదుకోవాలని సదరు రైతు కోరుతున్నాడు.